

బంగారు భవితకు మిర్రర్ ఇమేజ్

సర్కారు బడుల్లో అంచెలంచెలుగా అమలు చేసిన మిర్రర్ ఇమేజ్ పాఠ్యపుస్తకాలు సత్ఫలితాలనిచ్చాయని విద్యావేత్తలు అంటున్నారు. -8లో



హుండీ చోరీల ముఠా అరెస్ట్

పలమనేరు నియోజకవర్గంలో పలు ఆలయాల్లో చోరీలకు పాల్పడిన దొంగల ముఠా సభ్యులను గంగవరం పోలీసులు బుధవారం పట్టుకున్నారు. -8లో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	36	25
తిరుపతి	36	24
తిరుమల	32	21
గూడూరు	37	27
నగరి	37	26

న్యూస్‌రీల్

1 నుంచి బడులకు సెలవులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా మే 1 వ తేదీ నుంచి పాఠశాలలకు ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించిందని డీఈవో విజయేంద్రరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ వేసవి సెలవుల ఉత్తరులు జారీచేశారన్నారు. జిల్లాలో అన్ని యాజమాన్యాల పాఠశాలలు ఈ నెల 30న విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి ప్రొగ్రెస్ కార్డులు అందజేయాలన్నారు. ఈ విషయంలో ఎవరైనా అలసత్వం వహిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. జూన్ 12 వ తేదీన పాఠశాలలు తిరిగి పునఃప్రారంభమవుతాయని తెలిపారు. వేసవి సెలవుల్లో ఎలాంటి తరగతులు నిర్వహించకూడదని స్పష్టం చేశారు. ఎంఈవోలు తమ పరిధిలో నిత్యం తనిఖీలు చేయాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడైన తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే చర్యలు తప్పవని డీఈవో హెచ్చరించారు.

టీటీడీ గోశాలకు పశుగ్రాసం వితరణ



పశుగ్రాసం ట్రాక్టర్ ముందు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు దంపతులు

వి.కోట: టీటీడీ గోశాలకు బుధవారం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, భాగ్యమ్మ దంపతులు పశు గ్రాసం (పచ్చి మొక్కజొన్న గడ్డి)ని వితరణగా పంపారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ పలమనేరు సమీపంలోని టీటీడీ గోశాలలోని 400 పశువులకు దాదాపు 10 రోజులకు సరిపడా పచ్చి మేత రెండు ట్రాక్టర్ల లోడ్లను అందజేసినట్లు పేర్కొన్నారు. మరోక లోడ్ గ్రాసం అవసరమని నిర్వాహకులు కోరారని, త్వరలోనే పంపుతామని చెప్పినట్లు తెలిపారు. మండలంలోని పి. కొత్తూరు, గోవింద నగర్, పత్రపల్లెలో పాడి రైతులకు పచ్చి మేతను ఉచితంగా పంపిణీ చేసినట్లు జెడ్పీ చైర్మన్ పేర్కొన్నారు.

సకాలంలో జగనన్న విద్యాకానుక



యూనిఫామ్ కొలతలను పరిశీలిస్తున్న పీఓ వెంకటరమణారెడ్డి

బంగారుపాళెం: విద్యార్థులకు సకాలంలో జగనన్న విద్యాకానుకను అందిస్తామని జిల్లా విద్యాశాఖ ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో జగనన్న విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను ఆయన తనిఖీ చేశారు. 2023–24 సంవత్సరానికి జగనన్న విద్యా కానుకలో భాగంగా మండలంలోని విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన యూనిఫామ్‌ను పరిశీలించారు. నాణ్యత, కొలతలు సరిగ్గా ఉన్నాయా, లేదా అని పరిశీలించారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి సకాలంలో పిల్లలకు విద్యాకానుక కిట్లను అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీఎంఓ ఉదయలక్ష్మి, ఎంఈఓ నాగేశ్వర్‌రావు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

గజ బాధితుడికి మెరుగైన వైద్యం



గాయపడిన రైతును పరామర్శిస్తున్న అటవీ అధికారులు

బంగారుపాళెం: ఏనుగు దాడిలో తీవ్రంగా గాయపడిన రైతుకు మెరుగైన వైద్యం అందిస్తామని ఫారెస్ట్ రేంజ్ అధికారి బాలకృష్ణారెడ్డి అన్నారు. డీఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏనుగు దాడిలో తీవ్రంగా గాయపడి చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పద్మనాభరెడ్డిని ఆయన బుధవారం పరామర్శించారు. ఆస్పత్రి ఉన్నతాధికారులతో మాట్లాడి బాధితునికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, బంగారుపాళెం మండలంలో ఏనుగులు సంచరిస్తున్నాయని పొలాల వద్దకు వెళ్లే రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బాధితుడిని అటవీశాఖ తరపున ఆదుకుంటామన్నారు. సెక్షన్ అధికారి శివకుమార్, బీట్ అధికారి పద్మ పాల్గొన్నారు.

కుప్పంలో పచ్చనేతల కుట్ర

కుప్పంలో హింసా రాజకీయాలకు పచ్చనేతలు తెరదీశారు. శాంతిభద్రతలకు విఘాతం కల్పించి ఆ నెపాన్ని ప్రభుత్వంపై రుద్ది లబ్ధి పొందాలని పథకం పన్నారు. మంగళవారం ఏకంగా పోలీసు అధికారులపైనే దాడులకు తెగబడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ, నియోజకవర్గంలో రోజురోజుకూ టీడీపీ కేడర్ బలహీనపడుతుండడంతో ఓర్వలేకే హింసాత్మక చర్యలకు దిగుతున్నట్లు విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ఇదే అదనుగా వైఎస్సార్‌సీపీ శ్రేణులపై కవ్వింపు చర్యలకు దిగాలన్నదే పచ్చనేతల అజెండాగా నిఘా వర్గాల సమాచారం.



- శాంతి భద్రతల విఘాతానికి పన్నాగం
- ఆ నెపాన్ని ప్రభుత్వానికి ఆపాదించేలా కార్యాచరణ
- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లభిస్తున్న ఆదరణపై అక్కసు
- టీడీపీ ప్రతిష్ట దిగుజారుతుండడంతో డిప్రెషన్
- వైఎస్సార్‌సీపీపై కవ్వింపు చర్యలకు ప్రణాళిక
- మంగళవారం దాడులకు పాల్పడిన 60 మందిపై కేసుల నమోదు

సాక్షి, చిత్తూరు: కుప్పం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలపడుతుండడం టీటీపీ తట్టుకోలేకపోతోంది. సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలో నాలుగేళ్ల పాలనలో చంద్రబాబు ప్రతిష్ట మసకబారేలా కుప్పంలో అభివృద్ధి జరిగింది. ఫలితంగా టీడీపీ రోజు రోజుకూ బాగా బలహీ నపడుతోంది. 34 ఏళ్లు ఎమ్మెల్యే, 14 ఏళ్లు సీఎంగా చంద్రబాబు ఉన్నప్పటికీ కుప్పంలో అభివృద్ధి ఏమాత్రం జరగలేదు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక కుప్పం నియోకవర్గం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. రూ.కోట్లు అభివృద్ధి పనులకు మంజూరు చేయించారు. కుప్పానికి మున్సిపాలిటీ హోదా పెంచారు. సంక్షేమ పథకాల లబ్ధి టీడీపీ శ్రేణులు సైతం పెద్ద సంఖ్యలో పొందుతున్నారు. దీంతో పంచాయతీ, స్థానిక సంస్థలు, పురకపాలక ఎన్నికల్లో పచ్చపార్టీ డిపాజిట్లు గల్లంతయ్యాయి. అన్ని మండలాల్లో టీడీపీ నుంచి పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారు. దీంతో వచ్చే ఎన్నికల్లో తన సీటుకే ఎసరు వచ్చే ప్రమాదం ఉందని చంద్రబాబు సైతం గ్రహించారు. వైఎస్సార్ సీపీ బలపడడం టీడీపీ శ్రేణులు తట్టుకోలేకపోతున్నాయి. దీంతో ప్రభుత్వం ప్రతిష్ట దిగదార్చాలని పథకం ప్రకారం హింసా రాజకీయాలకు దిగుతున్నారు.

దాడులకు ఆద్యుడు చంద్రబాబే

సొంత నియోజవర్గం కుప్పంలో తన ప్రాభవం నిలుపుకోవాలనే తాపత్రయం చంద్రబాబులో గతంలోనే మొదలైంది. గత ఆగస్టులో మూడు రోజులపాటు కుప్పం నియోజవర్గంలో చంద్రబాబు పర్యటించారు. ముందస్తుగా సిద్ధం చేసుకున్న ప్రణాళికలతో ఆరాచకాలు సృష్టించారు. తన ప్రసంగాలతో కార్యకర్తలు, పచ్చనేతలను తీవ్రస్థాయిలో రెచ్చగొట్టి ఉసిగొల్పారు. దీంతో చంద్రబాబు సమక్షంలోనే పచ్చనేతలు రౌడీల అవతారం ఎత్తారు. వందలాది మంది టీడీపీ కార్యకర్తలతో వైఎస్సార్ సీపీ శ్రేణులనే టార్గెట్‌గా చేసుకుని దాడులకు తెగబడ్డారు. వారి ఇళ్లపై రాళ్ల వర్షం కురిపించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను తరిమితరిమి కొట్టారు. రక్త గాయాలతో గాయపరిచారు. ఇంకో వైపు పోలీసులను కూడా వదల్లేదు. వారిపై కూడా దాడులకు తెగబడ్డారు. తెలుగుతమ్ముళ్లు కర్రలు చేతబట్టుకుని కుప్పం వీధుల్లో స్వైర విహారం చేశారు. విచక్షణా రహితంగా దాడులు చేశారు. వారి దాడిలో మహిళా ఎంపీపీ అశ్విని కూడా గాయపడి ప్రాణభయంతో పరుగులు తీశారు. పైగా తమ వారిపైనే వైఎస్సార్‌సీపీ, పోలీసులు దాడులకు పాల్పడ్డారంటూ ఎల్లో మీడియాలో అబద్ధాలతో విస్తృతం ప్రచారం చేయించారు. దానికి రాష్ట్రం అంతా అల్లర్లు సృష్టించాలనే సంకేతాలు పంపారు. అప్పట్లో అడుగడుగునా శాంతిభద్రతలు విఘాతం కల్పించారు. ఆనెపాన్ని వైఎస్సార్‌సీపీపైకి మళ్లించి తద్వారా లబ్ధి పొందాలనే వ్యూహాలు పన్ని బొక్కబోర్లా పడ్డారు. చంద్రబాబు కుటిల రాజకీయాలు తెలిసిన కుప్పం వాసులు సైతం బాబు ఓవరాక్షన్ చూసి విస్తుపోయారు. కానీ, పోలీసులు సంయమనం పాటించారు. దాడులకు దిగిన వారిని గుర్తించి కేసులు నమోదు చేశారు.

అధినేత బాటలోనే తమ్ముళ్లు

ఆరు నెలలకు ముందు చంద్రబాబు పర్యటన సందర్భంగా అనుసరించిన వ్యూహాల తరహాలోనే తాజాగా హింసా రాజకీయాలకు తెర తీయాలని తమ్ముళ్లు భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందుకోసం అడపాదడపా కార్యక్రమాలు ఏర్పాటు చేసుకుని గుట్టుచప్పుడు కాకుండా హింసను ప్రేరేపించాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే మంగళవారం సీఎం జగన్ దిష్టి బొమ్మను దహనం చేసే కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనుమతి లేదని అడ్డు చెప్పిన సీఐ, ఎస్ఐలు కూడా కింద పడేలా పక్కకు నెట్టేశారు. నిత్యం రద్దీగా ఉండే ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో అటు ప్రయాణికులు, ఇటు ప్రజలు భయభ్రాంతులయ్యేలా నినాదాలతో రెచ్చిపోయారు. మంగళవారం పోలీసు అధికారులపై దాడులకు తెగబడిన సుమారు 60 మందిపై కేసులు నమోదు అయ్యాయి. 341,353,506,143,149 సెక్షన్ల కేసులు నమోదు చేశారు. పచ్చపార్టీ నేతల అల్లరిమూకల దాడులను పోలీసు శాఖ కూడా తీవ్రంగా పరిగణిస్తోంది.

పోలీసుశాఖ అప్రమత్తం

కుప్పం నియోజవర్గం కేంద్రంగా వైఎస్సార్‌సీపీశ్రేణులు, ఆ పార్టీ సానుభూతి పరులపై పచ్చపార్టీ గుండాలు, నేతలు కవ్వింపు చర్యలకు పాల్పడే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నాయి. ఏదో ఒక విధంగా ఘర్షణలు పెట్టుకుని నిప్పు రాజేయాలని భావిస్తున్నట్లు సమాచారం. దీంతో పోలీసు శాఖ కూడా అప్రమత్తమైంది. నిఘా వర్గాల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుని అందుకు తగ్గట్టుగానే ముందస్తు చర్యలు చేపడుతోంది. అందుకు భిన్నంగా అల్లరిమూకలు దాడులకు పాల్పడితే చట్టప్రకారం చర్యలకు సిద్ధమవుతోంది.

> **వివాదాలు సృష్టిస్తే ఉపేక్షించం**
>
> 
>
> కుప్పం ఒక్కటే అని కాదు. ప్రశాంత వాతావరణానికి ఇబ్బందులు కలిగించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వాళ్లు ఎక్కడా ఉన్న వదిలేదిలేదు. మాకు పార్టీలతో సంబంధంలేదు. తప్పు చేస్తే ఎవ్వర్నీ ఉపేక్షించం. పోలీసులను ఇబ్బందులకు గురిచేసి, పలు వివాదాలను ప్రభుత్వం పైకి రుద్ది, చెడ్డపేరు తీసుకురావడమే లక్ష్యంగా ఎవరు ఏం చేస్తున్నారనే దానిపై నిఘా కూడా పెట్టాం. అలాంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తాం.
>
> – వై.రిషాంత్‌రెడ్డి, ఎస్పీ, చిత్తూరు

కాణిపాకంలో నడక వంతెన ప్రారంభం



వంతెనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, చిత్రంలో ఆలయ చైర్మన్, ఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ దర్శనానికి వచ్చే భక్తుల సౌఖర్యార్థం నడక వంతెనను బుధవారం పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు బుధవారం ప్రారంభించారు. రూ.100లు, ఉచిత క్యూల్లో వచ్చే భక్తుల సౌకర్యార్థం రూ.15 లక్షలతో నడక వంతెనను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తులకు వసతులు కల్పించడంలో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తీసుకుంటు చర్యలు బాగున్నాయని ప్రశంసించారు. ఈఈ వెంకటనారాయణ, ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్లు, అధికారులు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లుగా షుగర్ ఫ్యాక్టరీలు

చిత్తూరు అగ్రికల్చర్: చిత్తూరు, రేణిగుంట సహకార చక్కెర కర్మాగారాలను ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లుగా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందని షుగర్ కేన్ కమిషనర్ వెంకట్రావు తెలిపారు. బుధవారం ఆయన చిత్తూరు షుగర్ కేన్ కార్యాలయానికి విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో గత ఏడాదికన్నా ఈ ఏడాది చెరకు సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. చిత్తూరు సహకార షుగర్ ఫ్యాక్టరీ లిక్విడేషన్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. చట్టప్రకారం లిక్విడేషన్ ప్రక్రియ పూర్తవగానే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభానికి చర్యలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. అంతకు ముందు కార్యాలయ సిబ్బందితో సమీక్షించారు. చిత్తూరు షుగర్ కేన్ అసిస్టెంట్ కమిషనర్ జాన్ విక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

చేనేతకు సంక్షేమ పోగు



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి, చిత్రంలో ఎంపీ రెడ్డెప్ప

- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి
- పెనుమూరులో 50మందికి మగ్గాల పంపిణీ

చిత్తూరు అగ్రికల్చర్ (పెనుమూరు): రాష్ట్రంలో చేనేతల అభ్యున్నతికి 25 పథకాలను తీసుకు వచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. బుధవారం పెనుమూరు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో చేనేత కార్మికులకు అవగాహన సదస్సు, మగ్గాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పెనుమూరు మండలంలోని గుడ్యాణంపల్లె, గొడుగుమానుపల్లె గ్రామాలకు చెందిన నేతన్నలను ఒక క్లస్టర్ కిందకు తీసుకు వచ్చినట్లు తెలిపారు. ఈ క్లస్టర్ అభివృద్ధికి ప్రభుత్వం రూ.1.5 కోట్ల నిధులను కేటాయించిందన్నారు. క్లస్టర్ పరిధిలో మొదటి విడతగా చేతితో బట్టలు తయారుచేసే మగ్గాలను 50 మందికి అందిస్తున్నట్లు చెప్పారు. ఒక్కొక్కరికి రూ.1.2 లక్షలు విలువ చేసే వర్క్ షెడ్లు 12 మందికి మంజూరు చేసినట్లు తెలిపారు.

అర్హతే ప్రామాణికం

ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అర్హతే ప్రామాణికంగా అందజేస్తోందని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప తెలిపారు. రాష్ట్రంలోని 84 వేల మంది చేనేతలకు ఫించన్లు వస్తుంటే, రాయలసీమ జిల్లాల్లో 54 వేల మందికి ఇస్తున్నట్లు పేర్కొన్నారు. హ్యాండ్లూమ్స్ రీజనల్ డైరెక్టర్ రాజారావు మాట్లాడుతూ నేతన్న నేస్తం కింద జిల్లాలో 166 మందికి రూ.39.84 లక్షలు అందిస్తున్నట్లు తెలిపారు. మరో 59 మందికి రూ.60 లక్షల రుణ సహాయం అందించేందుకు లబ్ధిదారులను గుర్తించినట్లు పేర్కొన్నారు. హ్యాండ్లూమ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట్రామ్, మార్కెట్ కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, సాతంబాకం ఎంపీటీసీ యశోదారెడ్డి అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉర్రూతలూగించిన సంగీత గేయధార



సంగీత గేయధార ఆలపిస్తున్న సాయికృష్ణ యాచేంద్ర

పుత్తూరు రూరల్: ప్రముఖ హరికథకుడు ఒంటి రవి పదాలను సంధించగా.. ప్రముఖ శతావధాని ఆముదాల మురళి నిషేధిత పదాలతో అడ్డుపడగా అన్నింటినీ అవలీలగా అధిగమించి తన సంగీత గేయధారతో డాక్టర్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. పుత్తూరు ఏడీకే కల్యాణ మండపంలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సాయికృష్ణ యాచేంద్ర 405వ సంగీత గేయధార కార్యక్రమం జరిగింది. పృచ్ఛకులు సంధించిన పలు పదాలను నేర్పుగా కూర్చి పాడిన గేయధారల్లో 'శాంతిగా విశ్రాంతిగా సమయం గడపాలి', 'వెన్నెలోయమ్మ వెన్నలా–పాలబు గ్గలాంటి వెన్నలా', 'సారంగ పాణి పద సార్వభౌముడా' అంటూ ఆలపించిన గేయాలు ఉర్రూతలూగించాయి.

సంగీత గేయధార సృష్టికర్త యాచేంద్ర

దేశం మొత్తం మీద సంగీత గేయధారను సృష్టించిన ఏకైక వాగ్గేయకారుడు డాక్టర్ సాయికృష్ణ యాచేంద్ర అని ప్రముఖ సినీ గేయ రచయిత భువనచంద్ర అన్నారు. భగవంతుని భాష సంగీతమని చెప్పారు. ఆ సంగీతం ద్వారా మనకు భగవంతుడు అందించిన వాగ్గేయకారుడే యాచేంద్ర అని అభివర్ణించారు. సంగీత విభావరిలో పులకరించిపోతున్న పుత్తూరులో కాసింత పొలం తీసుకుని ఇక్కడే స్థిరపోపడిపోవాలని ఉందంటూ చమత్కరించారు. ప్రముఖ కవి, విమర్శకుడు కాసల నాగభూషణం సంచాలకులుగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో పృచ్ఛకులుగా ప్రముఖ శతావధాని ఆముదాల మురళి, సంగీత సాహిత్య హరికథకుడు ఒంటి రవి, ఎస్వీ యూని వర్సిటీ ఉపన్యాసకులు డాక్టర్ పాలూరి బ్రహ్మానందరెడ్డి, రచయిత, సీనియర్ పాత్రికేయుడు మన్నవ గంగాధరప్రసాద్, తెలుగు సాహిత్యాభిమాని శోభారాజు వ్యవహరించారు. అంతకు ముందు విశిష్ట అతిథులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమాన్ని విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు బి.భాస్కర్‌రాజు, ఆర్వీ కృష్ణమరాజు, గుణశేఖర్‌రెడ్డి, యుగంధర్‌రాజు, అరుణాచలంరెడ్డి, రమేష్, రామచంద్రరాజు, ప్రభాకర్ రాజు, చెంగ్రాజు, బాలసుబ్రమణ్యం, కుప్పయ్య, చంద్రబాబు పర్యవేక్షించారు.

బాలికలదే పైచేయి!

- ఇంటర్ ఫలితాలు విడుదల
- ఫస్టియర్‌లో 56శాతం.. సెకండియర్‌లో 72శాతం ఉత్తీర్ణత

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్ పరీక్ష ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఎప్పటిలానే ఈ ఏడాది కూడా జనరల్, ఒకేషనల్‌లో బాలికలే పైచేయి సాధించారు. మొదటి సంవత్సరం పరీక్షకు 43,713మంది విద్యార్థులు హాజరవగా, 24,425 మంది (56శాతం) ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షకు 36,028 మంది హాజరవగా, 25,783మంది (72శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ఫస్టియర్‌కు సంబంధించి ఉమ్మడి చిత్తూరు జిల్లా రాష్ట్రంలో 8వ స్థానంలో నిలిచింది. అలాగే సెకండియర్ ఫలితాల్లో 4వ స్థానం దక్కించుకుంది.

ఒకేషనల్‌లోనూ బాలికలదే హవా..

ఇంటర్ ప్రథమ సంవత్సరం ఒకేషనల్ పరీక్షకు 3,131మంది హాజరవగా, 1,166 మంది (37శాతం), సెకెండియర్ పరీక్షలకు 2,628మంది హాజరవగా, 1,394మంది(53 శాతం) విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఫస్టియర్‌లో బాలురు 25శాతం, బాలికలు 51శాతం, సెకండియర్‌లో బాలురు 39శాతం, బాలికలు 69శాతం ఉత్తీర్ణత సాధించారు.



ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల వివరాలు

కేటగిరీ	పరీక్షకు హాజరైనవారు	ఉత్తీర్ణులు
బాలురు	22,239	11,204
బాలికలు	21,374	13,221
ద్వితీయ సంవత్సరం		
బాలురు	17,678	11,744
బాలికలు	18,350	14,039

గత ఐదేళ్ల ఫలితాల వివరాలు

సంవత్సరం	ఫస్టియర్ ఉత్తీర్ణత శాతం	సెకండియర్ ఉత్తీర్ణత శాతం
2017–18	67	77
2018–19	8	76
2019–20	57	64
2020–21	ఆల్ పాస్ (కోవిడ్)	
2021–22	51	58
2022–23	56	72

విద్యకు ప్రభుత్వం పెద్దపీట

- వసతి దీవెనను సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లాలో 30,912 మంది తల్లిదండ్రుల ఖాతాలకు రూ.33.29 కోట్ల జమ
- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్రంలో విద్యకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జగనన్న వసతి దీవెన కార్యక్రమాన్ని నిర్వహించారు. లైవ్ కార్యక్రమంలో సీఎం ప్రసంగాన్ని విద్యార్థులు వీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద విద్యార్థులను చదివించడం ముఖ్యమంత్రి బాధ్యతగా తీసుకున్నారని తెలిపారు. విద్యారంగంలో సమూల మార్పులు తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. ఇంగ్లిష్ మీడియం, నాడు నేడుతో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థలు తయారయ్యాయని పేర్కొన్నారు. విదేశాల్లో విద్యను అభ్యసించాలనే సంకల్పం ఉన్న వారి కోసం జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యే ఆస్తి

చిత్తూరు నగర మేయర్ అముద మాట్లాడుతూ తల్లిదండ్రులకు పిల్లల విద్య ఆర్థికంగా భారం కాకూడదనే విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన పథకాలను ప్రవేశ పెట్టారని తెలిపారు. వసతి దీవెనను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ జిల్లాలోని 34,133 మంది విద్యార్థులకు సంబంధించి 30,912 మంది తల్లిదండ్రుల ఖాతాలకు రూ.33.29 కోట్లు ముఖ్యమంత్రి జమ చేశారని పేర్కొన్నారు. అనంతరం మెగా చెక్కును ప్రారంభించారు. జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, డీఆర్‌ఓ ఎన్.రాజ శేఖర్, పాల ఏకిరి కార్పొరేషన్ చైర్మన్ మురళీ ధర్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి, మైనారిటీ కార్పొరేషన్ ఈడీ చిన్నారెడ్డి, గిరిజన సంక్షేమ అధికారి మూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.



మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద, కలెక్టర్ షణ్మోహన్

జగనన్న పథకాలు భేష్



మాది తమ్మినాయనపల్లె. కందూరు పంచాయతీ, సోమల మండలం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యారంగ అభివృద్ధికి చేస్తున్న పథకాలు భేష్‌గా ఉన్నాయి. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన కింద లబ్ధి పొందాను. అమ్మఒడి, జగనన్న విదేశీ విద్యాదీవెన లాంటి పథకాలు విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతున్నాయి.

– సి. మహేష్, బీటెక్ మూడవ సంవత్సరం, ఎస్వీసెట్ చిత్తూరు

సీఎం జగనన్నకు రుణపడి ఉంటా



మాది చిత్తూరు. ఎస్వీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో బీకాం డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్నా. మా నాన్న లేడు. అమ్మ హోటల్ నడుపుతూ నన్ను చదివిస్తోంది. ఇంటర్‌లో అమ్మఒడి కింద లబ్ధి పొందా. తర్వాత జగనన్న వసతి దీవెన, విద్యాదీవెన కింద ఆర్థిక లబ్ధి పొందుతున్నాను. విద్యార్థుల భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటా.

– ఎ.యామిని, బీకాం డిగ్రీ రెండవ సంవత్సరం

ఆర్థికభారం తగ్గించారు



మాది కడప జిల్లా బద్వేల్. రైతు కుటుంబం. చిత్తూరు ఎస్వీ సెట్ కాలేజీలో బీటెక్ ఈసీఈ మూడో సంవత్సరం చదువుతున్నా. ఇంటర్ తిరుపతిలో చదివా. రెండవ సంవత్సరం అమ్మఒడి లబ్ధి పొందాను. తల్లిదండ్రులకు ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు వసతి దీవెన, విద్యా దీవెన అందించడం సంతోషంగా ఉంది. దీంతో నైపుణ్యాలను పెంపొందించుకుని ఉద్యోగ అవకాశాలను పొందవచ్చు.

– విష్ణువర్ధన్ రెడ్డి, బీటెక్ మూడవ సంవత్సరం ఎస్వీసెట్, చిత్తూరు

క్లుప్తంగా

ర్యాష్ డ్రైవింగ్.. వ్యక్తికి గాయాలు


తీవ్రంగా గాయపడి నారాయణ

గంగవరం: విద్యార్థుల బైక్ విన్యాసాలు, ర్యాష్ డ్రైవింగ్ కారణంగా మరో ద్విచక్ర వాహనదారుడు ప్రమాదానికి గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. వివరాలు..పెద్దపంజాణికి చెందిన నారాయణ(40) పలమనేరులోని టమాట మార్కెట్‌లో కూలీగా పని చేస్తున్నాడు. బుధవారం ద్విచక్ర వాహనంలో ఊరి నుంచి పలమనేరుకు బయలుదేరాడు. ఈ సమయంలో మదర్‌థెరిసా కళాశాల విద్యార్థులు కలగటూరు క్రాస్‌లో దాబా హోటళ్ల వద్ద కాలక్షేపం చేస్తూ రోడ్డుపై కొద్దిసేపు బైక్ విన్యాసాలు చేస్తున్నారు. అలా బైక్‌లో నిర్లక్ష్య డ్రైవింగ్ చేస్తూ పలమనేరుకు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో నారాయణ తీవ్ర రక్త గాయాలకు గురై స్పృహ కోల్పోయాడు. గమనించిన స్థానికులు చికిత్స కోసం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ అతని పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతికి రెఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

చిత్తూరు అర్బన్: బంగారుపాళ్యం మండలంలో బుధవారం ఎస్‌ఈబీ అధికారులు కర్ణాటక మద్యం విక్రయాలపై దాడులు నిర్వహించారు. పాలమాకుల పల్లి గ్రామానికి చెందిన శేషాచలపతి (55) నుంచి 32 కర్ణాటక మద్యం ప్యాకెట్లను పట్టుకున్నారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ మోహన్‌బాబు, సిబ్బంది కృష్ణయ్య, సుబ్రమణ్యం గౌడ్, వెంకటేష్, క్రిష్ణవేణి, శ్వేత పాల్గొన్నారు.

బంగారు భవితకు మిర్రర్ ఇమేజ్

వైఎస్సార్ సీపీ సర్కారు విద్యావ్యవస్థలో అత్యున్నత ప్రమాణాలను అమలు చేస్తోంది. ఇటు మాతృభాషతో పాటు అటు ఆంగ్లభాషలోనూ విద్యార్థులు రాణించేలా చర్యలు చేపట్టింది. సర్కారు బడుల్లో అంచెలంచెలుగా అమలు చేసిన మిర్రర్ ఇమేజ్ పాఠ్యపుస్తకాలు సత్ఫలితాలనిచ్చాయని విద్యావేత్తలు అంటున్నారు. రెండు మాధ్య మాల్లో పాఠ్యాంశాలు ఉండడం ద్వారా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు బోధన సులభం మారింది. మిర్రర్ ఇమేజ్ తరహాలో ఒక పేజీలో తెలుగు, మరో పేజీలో ఇంగ్లిష్‌లో పాఠ్యాంశాలుండేలా చర్యలు చేపట్టడంతో విద్యార్థులు చదువులో బాగా రాణిస్తున్నారు.

- ఇటు తెలుగు.. అటు ఇంగ్లిష్
- సర్కారు బడుల విద్యార్థులకు ఉపయోగకరం
- తెలుగు మీడియం విద్యార్థులకు ఇబ్బంది లేకుండా
- పేజీకి అటూ ఇటూ ఇంగ్లిష్, తెలుగులో ముద్రణ

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణ సంస్థ నిపుణుల సహకారంతో తెలుగు–ఇంగ్లిష్ భాషల్లో రూపొందించిన మిర్రర్ ఇమేజ్ పుస్తకాలు సత్ఫలితాలనిస్తున్నాయి. 2020వ సంవత్సరం నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఆ పుస్తకాలను అమలులోకి తీసుకొచ్చింది. అంచెలంచెలుగా అన్ని తరగతులకు ఆ పుస్తకాలను అమలు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లో అన్ని యాజమాన్యాల పాఠశాలలు 2901 ఉన్నాయి. అందులో సర్కారు బడులు 2483 ఉన్నాయి. ఒకటో తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు మిర్రర్ ఇమేజ్ పుస్తకాలను అమలులోకి తీసుకొచ్చింది. తెలుగు మీడియంలో చదివే విద్యార్థులు ఉన్నత విద్యకు వచ్చే సరికి ఇంగ్లిష్ చదువులు చదవలేక ఇబ్బందులు పడేవారు. ఆ


ప్రభుత్వం రూపొందించిన మిర్రర్ ఇమేజ్ పుస్తకం


మిర్రర్ ఇమేజ్ పుస్తకం

విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని తీసుకొచ్చిన మిర్రర్ పుస్తకాలు సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు ఉపయోగకరంగా మారాయి.

బోధనాభ్యాసం సులువు

గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ఒకటి నుంచి ఇంటర్మీడియెట్ వరకు తెలుగు మీడియంలో విద్యనభ్యసిస్తుంటారు. ఆ తర్వాత డిగ్రీ చదువులు పూర్తిగా ఇంగ్లిషులో చదవాలంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి. ఇంగ్లిషు భాషలో ఉండే చదవలేక డిగ్రీ చదువును మధ్యలో మానేసిన విద్యార్థులు ఎంతో మంది ఉన్నారు. అలాంటి పరిస్థితులను అధికమించేందుకు ప్రభుత్వం పాఠశాల స్థాయి నుంచి మిర్రర్ పాఠ్యపుస్తకాలను ప్రవేశపెట్టింది. చిన్నతనం నుంచే తెలుగు మీడియం చదివే విద్యార్థులు సులువుగా ఇంగ్లిషును అర్థం చేసుకునేలా పాఠ్య పుస్తకాలను ముద్రించింది. ఈ విధానం విద్యార్థుల భవిష్యత్ కు చాలా ఉపయోగపడుతున్నట్లు విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా సమాచారం

అన్ని యాజమాన్యాల పాఠశాలలు	ప్రభుత్వ బడులు
2,901	2,483
ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు	ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులు
418	1,70,982

ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు 73,765

విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు


రాష్ట్ర ప్రభుత్వం సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తోంది. విద్యావ్యవస్థకు అధిక ప్రాధాన్యతనిచ్చి అనేక మార్పులను తీసుకువస్తోంది. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మిర్రర్ ఇమేజ్ పుస్తకాలు తెలుగు మీడియం చదివే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉన్నాయి.

– విజయేంద్రరావు, డీఈఓ, చిత్తూరు

సత్ఫలితాలిచ్చాయి


మిర్రర్ ఇమేజ్ పుస్తకాలు సత్ఫలితాలు ఇచ్చాయి. విద్యార్థులు చక్కగా పాఠ్యాంశాలను అర్థం చేసుకుని అభివృద్ధి చెందారు. ఉన్నత ఆలోచనలతో పిల్లల బంగారు భవిష్యత్తుకు ప్రభుత్వం బాటలు వేస్తోంది. ఈ పుస్తకాల వల్ల బోధనాభ్యసనం సులువుగా ఉంటోంది.

– తులసిబాబు, కణ్ణన్ ప్రభుత్వ పాఠశాల హెడ్‌మాస్టర్

29న కారుణ్య నియామక పత్రాల పరిశీలన

చిత్తూరు రూరల్: ఈనెల 29వ తేదీన ఆర్టీసీలో కారుణ్య నియామక పత్రాల పరిశీలన జరుగుతుందని డీపీటీఓ జితేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. తిరుపతిలోని డీపీటీఓ కార్యాలయంలో ఉదయం 9.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కారుణ్య నియామకానికి అర్హులైనవారు ఈవిషయాన్ని గుర్తించాలని ఆయన పేర్కొన్నారు.


చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,200
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,500

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.78

గంటపాటు పసికందు మాయం

- ఆస్పత్రి సిబ్బంది పొరబాటు
- ఆందోళన పడిన కుటుంబ సభ్యులు


ఐసీయూ వార్డులో పోలీసుల విచారణ

చిత్తూరు రూరల్: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం ఓ పసికందు గంటపాటు మాయమైంది. బాధిత కుటుంబ సభ్యుల వివరాల మేరకు...నగరంలోని ఎంజీఆర్‌వీధికి చెందిన సంధ్యారాణి ఈనెల 22వ తేదీన ప్రసవం కోస ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. డాక్టర్లు సుఖ ప్రసవం చేయడంతో ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. మరుసటి రోజు జ్యాండిస్ ఉందని బిడ్డను ఐసీయూ వార్డుకు తలించారు. మూడు రోజులపాటు డాక్టర్లు ఆ బిడ్డకు చికిత్స అందిస్తూ వస్తున్నారు. బుధవారం ఉదయం పసికందు మాయమైంది. దీంతో తల్లితో పాటు కుటుంబ సభ్యులు అల్లాడిపోయారు. బిడ్డ ఆచూకీ కోసం ఆస్పత్రి సిబ్బంది వెతుకులాటలో పడింది. బంధువులకు సమాచారం అందడంతో ఐసీయూ వార్డు వద్ద గుమికూడారు. ఇంతలో పోలీసులు కూడా అక్కడికి చేరుకుని విచారణ ప్రారంభించారు. కానీ మంగళవారం సాయంత్రం సంధ్య అనే గర్భిణి ఆడ బిడ్డకు జన్మిచింది. ఆ బిడ్డ కూడా ఐసీయూలో ఉంది. సిబ్బంది పొరపాటున సంధ్యారాణికి ఇవ్వాల్సిన బిడ్డను సంధ్య కుటుంబ సభ్యులకు ఇచ్చారు. అసలు విషయం తెలుసుకున్న డాక్టర్లు, సిబ్బంది, పసికందు కుటుంబీకులు చివరకు ఊపిరి పీల్చుకున్నారు.

గ్రూప్1, 2 అభ్యర్థులకు స్కాలర్‌షిప్ టెస్ట్

సాక్షి, తిరుపతి:ఏపీపీఎస్ త్వరలో నిర్వహించే గ్రూప్–1, 2 పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు హైదరాబాద్‌కు చెందిన ట్వంటీ ఫస్ట్ సెంచరీ ఐఏఎస్ అకాడమీ స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్ పి.క్రిష్ణప్రదీప్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలనే ఆసక్తి ఉండి ఆర్థికంగా వెనుకబడిన అభ్యర్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రతిభ అన్వేష పరీక్షను మే 7వ తేదీ ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షలు ప్రతిభ కనబరచిన అభ్యర్థులకు ఉచితంగా గ్రూప్–1, 2 పరీక్షలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్, పరీక్ష సిలబస్ తదితర వివరాలకు 91332 37733, 91336 37733 నంబర్లలో సంప్రదించాలని ఆ ప్రకటనలో తెలియజేశారు.

ఎస్ఎస్ ట్యాంకు మరమ్మతులకు రూ.9 కోట్లు

- ఫలించిన మంత్రి ఆర్‌కే రోజా ప్రయత్నం

పుత్తూరు రూరల్: పుత్తూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పునరుద్ధరణకు రూ.9 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జె.శ్యామలారావు జీఓ ఆర్టీ నెం.269ను ఈనెల 25న విడుదల చేశారు. పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా రెండేళ్ల పాటు చేసిన కృషి ఫలితంగా ఈ నిధులు మంజూరయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో నాసిరకంగా నిర్మించిన పుత్తూరు ఎస్ఎస్ ట్యాంకు 2021 మే 18న కుంగింది. 10 అడుగుల లోతుతో 200 మీటర్ల పొడవున కట్ట కుంగిపోయింది. అప్పుడు ఎమ్మెల్యే హోదాలో ఉన్న ఆర్‌కే రోజా ప్రజా ఆరోగ్యశాఖ పర్యవేక్షణలో మున్సిపల్ జనరల్ ఫండ్స్‌తో యుద్ధప్రాదిపతికన మరమ్మతులు చేపట్టారు. 2021 జూన్ 25న ట్యాంకు కట్ట శాశ్వత పరిష్కారం కోసం నిపుణుల కమిటీని వేయాల్సిందిగా స్పెషల్ చీఫ్ సెక్రటరీకి లేఖ రాశారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం త్రిసభ్య కమిటీని వేసి ట్యాంకు కట్ట నిర్మాణ ప్రమాణాలను పరిశీలించింది. ప్రజా ఆరోగ్యశాఖ ట్యాంకు మరమ్మతులకు రూ.9 కోట్లు అవసరమవుతాయని ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. ఫలితంగా నేడు నిధులు మంజూరు అయ్యాయి. ట్యాంకు కట్టకు శాశ్వత పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.

ముగిసిన టెన్త్ మూల్యాంకనం

చిత్తూరు కలెక్టరేట్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాల మూల్యాంకనం బుధవారంతో ముగిసిందని డీఈవో విజయేంద్రరావు వెల్లడించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 19 నుంచి ప్రారంభమైన మూల్యాంకనం వారం రోజుల పాటు జరిగిందని తెలిపారు. వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన 1.83 లక్షల జవాబుపత్రాలను 1,200 మంది సిబ్బంది మూల్యాంకనం చేశారని చెప్పారు. అలాగే ఈ నెల 27 నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షల మూల్యాంకనం ప్రారంభమవుతుందని డీఈవో తెలిపారు.

నాటు..ఘాటుపై దాడులు

- 1072 లీటర్ల సారా ఊట ధ్వంసం
- స్పాట్‌లో కనిపించని నిందితులు
- ఫారెస్ట్ సిబ్బంది ముందే ఎందుకెళ్లారు?

సాక్షి ఎఫెక్ట్..

పలమనేరు: పలమనేరు ఫారెస్ట్ రేంజి పరిధిలోని నెల్లిపట్ల అటవీప్రాంతంలో తమిళనాడు సరిహద్దుకు ఆనుకొని ఉన్న కొండిన్య అడవిలో సారా బట్టీలపై సెబ్ అధికారులు, తమిళనాడు రాష్ట్రం గుడియాత్తానికి చెందిన కలాల్ పార్టీ సంయుక్తంగా మంగళవారం దాడులు నిర్వహించాయి. అక్కడ సారా తయారీకి సిద్ధంగా ఉన్న 1,072 లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. ఈనెల 15న 'సాక్షి'లో 'నాటు..ఘాటు' శీర్షికన ప్రచురితమైన కథనంపై జిల్లా సెబ్ అధికారి ఆదేశాలతో ఈ దాడులు జరిగాయి. స్థానిక సెబ్, డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్, బోర్డర్ ఎక్సైజ్, తమిళనాడుకు చెందిన కలాల్ పార్టీలు దాడుల్లో పాల్గొన్నాయి. దాడులు విషయం తెలుసుకున్న స్మగర్లు ముందుగానే సంఘటన స్థలం నుంచి పరారైనట్లు తెలుస్తోంది. స్పాట్‌కు వెళ్ళిన అధికారులు అక్కడున్న సారా ఊటను మాత్రం నాశనం చేశారు. త్వరలోనే నిందుతులను అరెస్ట్ చేస్తామని అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరిండెంటెంట్ అయిషాబేగం తెలిపారు. ఈ దాడుల్లో స్థానిక సెబ్ సీఐ ఎల్లయ్య,డీటీఎఫ్ సీఐ మాధవస్వామి, తమిళనాడు కళాల్ పార్టీ సీఐ కృష్ణవేణి, సెబ్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, అంతర్‌రాష్ట్ర ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా దాడులు చేస్తున్నారని తెలిసి అక్కడున్న ఫారెస్ట్ సిబ్బంది వీరితో కలవకుండా నాటుసారా బట్టీల వద్దకు ముందుగానే వెళ్లారు. వీరు ముందుగానే ఎందుకు వెళ్లారన్న విషయమై ఎఫ్ఆర్వో నయీమ్ అలీ విచారిస్తున్నట్లు సమాచారం.


సారా ఊటను ధ్వంసం చేస్తున్న సెబ్ అధికారులు

హుండీ చోరీల ముఠా అరెస్ట్

- రూ.5 లక్షల విలువజేసే ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ సుధాకర్‌రెడ్డి



నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, పక్కనే రికవరీ చేసిన ఆభరణాలు

గంగవరం: పలమనేరు నియోజకవర్గంలో పలు ఆలయాల్లో చోరీలకు పాల్పడిన దొంగల ముఠా సభ్యులను గంగవరం పోలీసులు బుధవారం పట్టుకున్నారు. బుధవారం పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిందితుల అరెస్ట్ చూపి రిమాండ్‌కు తరలించారు. వివరాలను డీఎస్పీ వెల్లడించారు. గంగవరం మండలం డ్రైవర్స్ కాలనీకి చెందిన లోకేష్, గోవర్ధన్, చౌడేపల్లె మండలం రాజులూరుకు చెందిన శివకుమార్, పెద్దపంజాణి మండలం గౌరీ నగరానికి చెందిన మార్కొండయ్య ముఠాగా ఏర్పడి రాత్రిపూట గ్రామాలకు దూరంగా ఉన్న ఆలయాల్లో చోరీలకు పాల్పడేవారు. లోకేష్ ముఠా నాయకుడిగా ఉంటూ ఏరోజు ఏ ఊరి ఆలయానికి వెళ్లి చోరీ చేయాలన్న దానిపై ముందుగా స్కెచ్ వేస్తాడు. ఇదే తరహాలో నాలుగు రోజులు కిందట మండలంలోని శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో తాళాలు పగొలగొట్టి బంగారు, వెండి నగలతో పాటు స్వామి అలంకరణకు ఉపయోగించే గిల్టు నగలు, కిరీటాలను అపహరించారు. ఇదే రోజు కూర్నిపల్లె క్రాస్‌లోని ఓం శక్తి ఆలయంలో బంగారు నగల చోరీకి పాల్పడ్డారు. ఇదే ముఠా గతనెలలో యాదమరి మండలం వినాయకస్వామి ఆలయం, పెద్ద పంజాణి మండలం ఆయలపేటలోని ముత్యాలమ్మ గుడిలో చోరీలకు పాల్పడ్డారు. ఆయా ఆలయాల నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు అయ్యాయి. పోలీసులు, ఐడీ పార్టీ సిబ్బంది సంయుక్తంగా దర్యాప్తు ప్రారంభించారు. పక్కా సమాచారంతో గంగవరం డ్రైవర్స్ కాలనీలోని ఇంట్లో ఏ1 నిందితుడు లోకేష్, ముఠాలోని ముగ్గురు నిందితులను పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వారి నుంచి రూ.5 లక్షలు విలువ చేసే 22 గ్రాముల బంగారు నగలు, 500 గ్రాముల వెండి, హుండీ నగదు, అలంకరణ కిరీటాలు వంటి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న గోవర్ధన్‌ను త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ పేర్కొన్నారు. కేసు ఛేదించిన ఐడీ పార్టీ సిబ్బందిని, పోలీసులను డీఎస్పీ అభినందించారు. సీఐ అశోక్ కుమార్, ఎస్ఐ ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

తీరుమారకుంటే మా స్టైయిల్‌లో బుద్ధి చెబుతాం

శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే ఎంతటివాళ్లైనా ఉక్కుపాదం మోపుతామని చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి హెచ్చరించారు. ఇటీవల చిత్తూరులో చోటుచేసుకున్న పలు పరిణామాలు.. తాజాగా వేసవి సెలవులు వస్తుండడంతో ప్రజల్ని అప్రమత్తం చేస్తూ డీఎస్పీ పలు సూచనలు చేశారు. రౌడీషీటర్లు.. నేర ప్రవృత్తినే నమ్ముకున్న వాళ్లను హెచ్చరించారు. బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఆ వివరాలు డీఎస్పీ మాటల్లోనే..

- రౌడీ షీటర్లు అతిగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవు
- పీడీ యాక్టు ప్రయోగించేందుకు కూడా వెనుకాడం
- వేసవి వినోదాలకు వెళితే.. పోలీసులకు చెప్పండి
- చోరీలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటాం
- చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి


శ్రీనివాసమూర్తి, డీఎస్పీ

చిత్తూరు అర్బన్: 'చిత్తూరులో ఇటీవల కొందరు రౌడీలు, రౌడీషీటర్లు అతిగా ప్రవర్తిస్తున్నారు. అలాంటి వాళ్లను ఏమాత్రం ఉపేక్షించొద్దని ఎస్పీ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. సివిల్ సెటిల్‌మెంట్లు, పంచాయతీలు , దందాలు ఫాషన్‌గా ఫీలవుతున్నారు. అలాంటి వాళ్లను వదిలేదే లేదు. మాకు రాజకీయ పార్టీలతో సంబంధంలేదు. సామాన్యుడికి ఇబ్బంది కలిగించేలా ప్రవర్తించడం.. శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం చేస్తే మాత్రం ఊరుకునేదిలేదు. ఇటీవల ఈ తరహా ఘటనలు ఒక్కోటిగా బయట పడుతున్నాయి. ఇంతటితో ఇది ఆగదు. రౌడీషీటర్ కదలికలపై మా నిఘా ఉంటుంది. ప్రతి స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తాం. ఇదే ప్రవృత్తిగా పెట్టుకున్నవాళ్లపై పీడీ యాక్టులు ప్రయోగించే విషయం కూడా పరిశీలనలో ఉంది. అవసరమైతే నగర బహిష్కరణ కూడా చేస్తాం. రౌడీషీటర్ల పాస్‌పోర్టు సైజ్ ఫోటో, కుటుంబ వివరాలు, ఇతర వివరాలను తీసుకోవడంతో పాటు వాళ్ల కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సీఐలను ఆదేశించాం. చేసిన పనులు చాలనుకుని పశ్చాత్తాపంతో మసలుకుని ఎవరి పరిధిలో వాళ్లు ఉంటే మంచిది. లేదంటె అలాంటి వాళ్లకు మా పద్ధతిలో బుద్ధి చెప్పాల్సి ఉంటుంది.

హత్య కేసు..

గుడిపాల, యాదమరి, తవణంపల్లె, గంగాధరనెల్లూరు, పెనుమూరు ప్రాంతాల్లో కొందరు వేటగాళ్లు వన్యప్రాణులను వేటాడుతున్నట్లు మా వద్ద సమాచారం ఉంది. వన్య ప్రాణుల కోసం అడవుల్లో విద్యుత్ తీగలు పెడుతున్నారు. ఇవి తగిలి మనుషులు చనిపోతున్నారు. దీనికి కారణమైన వేటగాళ్లపై హత్య కేసు నమోదు చేస్తాం. ఇదేపనిగా పెట్టుకున్నవారిపై రౌడీషీట్లు తెరుస్తాం.

ఊర్లకు వెళితే ఫోన్ చేయండి..

వేసవి సెలవులు వస్తున్నాయి. విహార యాత్రలు, బంధువుల ఇళ్లకు, ఆలయాలకంటూ చాలా మంది టూర్లు ప్లాన్ చేస్తుంటారు. ఎవరైనా ఊరికి వెళ్లే ముందు మాకు ఒక్కసారి సమాచారం ఇవ్వండి. డయల్–100, పోలీసు వాట్సప్–9440900005, నా నెంబరు (9440796704)కు సమాచారం ఇస్తే ఇళ్లకు తాళాలు వేసే ముందు అక్కడ లాక్డ్ హౌస్ మానటరింగ్ సిస్టమ్ అనే పరికరాన్ని ఉచితంగా పెడుతాం. దీనివల్ల దొంగతనం జరగకుండా ముందస్తుగా నిరోధించడం సాధ్యమవుతుంది. ప్రజల నుంచి సహకారం వస్తే తప్ప దొంగతనాలను అరికట్టడం సాధ్యం కాదు...' అని డీఎస్పీ అన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


మురళి (ఫైల్)

గుడుపల్లె: మండలంలోని జోగ్యానూరు గ్రామానికి చెందిన మురళి(33) బుధవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కథనం..ఆరేళ్ల కిందట అదే మండలం జబ్బిగానిపల్లెకు కాంతమ్మతో మురళికి వివాహమైంది. అప్పటి నుంచి అత్తింటిలోనే కాపురం ఉంటున్నాడు. కొన్నాళ్లుగా జోగ్యానూరులో కాపురం పెట్టాలని భార్యను మురళి కోరుతున్నాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం మురళి ఆత్మహత్య చేసుకున్నాడు. వీరికి సాత్విక్(4) దర్శన్(1) పిల్లలు ఉన్నారు. సోదరుడు మురుగేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

సదుం: భర్త వేధింపులపై మండల కేంద్రంలోని సచివాలయంలో పనిచేస్తున్న ఆసియా బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమెకు చాంద్‌బాషాతో పదేళ్ల కిందట వివాహం జరిగింది. కొన్నాళ్లుగా భర్త తనను మానసికంగా వేధిస్తున్నాడని ఆసియా ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మారుతి తెలిపారు.

ప్రకృతి సాగును ప్రోత్సహించాలి

బంగారుపాళెం: ప్రకృతి సాగు పద్ధతుల వైపు రైతులను మళ్లించాల్సిన అవసరం ఉందని ఉద్యానశాఖ కమిషనర్ శ్రీధర్ అన్నారు. మండలంలోని మొగిలి గ్రామంలో ఆదర్శరైతు జగదీష్‌రెడ్డి ప్రకృతి విధానంలో సాగు చేస్తున్న మామిడి తోటను బుధవారం ఆయన పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ రసాయన మందులకు స్వస్తి పలికి సహజంగా లభించే సేంద్రియ ఎరువులలో ప్రకృతి విధానంతో పంటలు సాగు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

కోనేరులో వ్యక్తి మృతదేహం

చౌడేపల్లె:ఏ.కొత్తకోట సమీపంలోని పీతరకుంట పక్కన కోనేరు బుధవారం వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రవికుమార్ సిబ్బందితో అక్కడి చేరుకున్నారు. మృతదేహాన్ని వెలికి తీయించారు. గుర్తుపట్టలేని విధంగా మృతదేహం కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. లభించిన ఆధారాలతో ఏ.కొత్తకోటకు చెందిన కృష్ణమూర్తి కుమారుడు లోకేష్(35)గా గుర్తించారు. కృష్ణమూర్తి కొన్నేళ్లుగా చింతామణిలో కాపురం ఉంటూ అప్పుడప్పుడు స్వగ్రామమైన ఏ.కొత్తకోటకు వచ్చేవాడు. అనారోగ్యంతో బాధపడుతున్న లోకేష్ ఈనెల 10వ తేదీ నుంచి చింతామణిలో అదృశ్యమయ్యాడు. పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోయింది. బుధవారం కోనేరులో శవమై తేలాడు. తల్లి రెడెమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.